సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

SK1 one NEWS HD

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 824 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | ఆదివారం 14-06-2026


★నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది

★సుసంపన్న భవిష్యత్ కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టాలి

★స్పీడ్, బ్రాండ్ సీబీఎన్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఏపీ ప్రత్యేకతలు

★విశాఖలో డీజీ 100ఎక్స్ ఏపీ సదస్సులో మంత్రి నారా లోకేష్

★వికసిత్ భారత్ నిర్మాణమే మన లక్ష్యం. నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది. సుసంపన్న భవిష్యత్ కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

★రాష్ట్రంలో ఉన్నత విద్య, డిజిటల్ పరివర్తన, ఆధునిక సాంకేతికత అంశాలపై విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్ లో జరిగిన 'డీజీ 100ఎక్స్ ఏపీ' సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

★మన దేశంలో విద్య, ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అత్యుత్తమ మేధావుల మధ్య విశాఖపట్నంలో ఉండటం ఆనందంగా ఉంది.

### వికసిత్ భారత్ నిర్మాణమే

# మన లక్ష్యం

**ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ఫలితాలు విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్..**

**ఆర్జీయూకేటీ ఆరేళ్ల బీటెక్ కోర్సు ప్రవేశాల ఫలితాలు విడుదల**

**ఎంపికైన విద్యార్థులు rgukt.in వెబ్‌సైట్ నుంచి లేఖలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు**



విశాఖపట్నం: వికసిత్ భారత్ నిర్మాణమే మన లక్ష్యం. నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది. సుసంపన్న భవిష్యత్ కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య, డిజిటల్ పరివర్తన, ఆధునిక సాంకేతికత అంశాలపై విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్ లో జరిగిన 'డీజీ 100ఎక్స్ ఏపీ' సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

మిగతా 2లో

### అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

## హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సత్యకుమార్
ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య
ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి



ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు. గత రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను,

మిగతా 2లో

### తిరుపతి సభ విజయోత్సవం కాదు..

## వెన్నుపోటు ఉత్సవం



❋'క్యాష్--రాజేష్--లోకేష్' ఫార్ములాతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారు

❋తిరుపతి సభ రెండేళ్ల విజయోత్సవ సభ కాదు.. ఆరు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ.

❋సూపర్ సిక్స్ అని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు సూపర్ సైలెంట్ అయ్యారు.

❋మేనిఫెస్టోను జేబులో పెట్టి.. ఎర్రబుక్‌ను అరచేతిలో పెట్టుకున్నారు.

తిరుపతిలో ఈ నెల 12న కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెండేళ్ల విజయోత్సవ సభ వాస్తవానికి విజయాలను చెప్పుకునే సభ కాదని, ఆరు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ అని వైయస్ఆర్‌సీపీ

మిగతా 2లో

## హామీలన్నీ ఉల్లంఘించి ప్రజలను, యువతను, రైతులను జగన్ మోసం చేశారు.

**వెన్నుపోటు, గొడ్డలివేటుకు జగన్ బ్రాండ్ అంబాసిడర్**

● కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని వెల్లడి

● జగన్ రెడ్డి కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు

● డీఎస్సీ, పోలీసు ఉద్యోగాలతో పాటు అనేక హామీలను ఇప్పటికే అమలు చేశామని స్పష్టం



ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిన జగన్ ను మించిన వెన్నుపోటుదారుడు మరొకరు లేరని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "వెన్నుపోటుకు, గొడ్డలివేటుకు జగన్ రెడ్డి

మిగతా 2లో

### విద్యాశాఖను చెడగొట్టాలని

## లోకేశ్‌కు ఆ శాఖ అప్పగించారా ?

**లోకేశ్‌కు అందుకే ఆ శాఖ అప్పగించారా?**

● ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు

● రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు.

● రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఉందా కూటమి ప్రభుత్వ వెన్నుపోట్లపై పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాం.



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యావసర సరుకుల

మిగతా 2లో

## ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొనేలా సన్నద్ధమవ్వండి



⌘ఏఐపై పట్టుసాధించండి

⌘సైబర్ నేరాలను అరికట్టండి

⌘మాదకద్రవ్యాల పీచమణచండి

⌘నీతి ఆయోగ్ భేటీలో రాష్ట్రాలకు ప్రధాని దిశానిర్దేశం

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ 11వ పాలకవర్గ సమాశంలో రాష్ట్రాలకు దేశం ఎదుర్కొంటున్న పలు సవాళ్లు, రాబోయే సువర్ణావకాశాలపై ప్రధాని మోదీ

మిగతా 2లో

## జూలై 9న అయతోల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు!

● ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీకి సంబంధించిన ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించే అంత్యక్రియల పూర్తి షెడ్యూల్‌ను ఇరాన్ అధికారులు ప్రకటించారు.

● అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడుల్లో ఖమేనీ మరణించినట్లు పేర్కొంటూ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఆయన అంత్యక్రియలు ఐదు రోజులపాటు వివిధ నగరాల్లో నిర్వహించనున్నారు.

మిగతా 2లో



## యుద్ధాన్ని ముగించేందుకు సమయం ఆసన్నమైంది మిత్రమా!

● ఇరాన్‌తో ఒప్పందం కొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశం

● నెతన్యాహుకు ట్రంప్ ఫోన్‌లో స్పష్టమైన సందేశం

● 60 రోజుల కాల్పుల విరమణకు ప్రతిపాదనలు



ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో

### కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు

## జరుపుకోవడం సిగ్గుచేటు



❖సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయిందన్న షర్మిల

❖అప్పులు చేయడంలో ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని ఎద్దేవా

❖పాలన అంతా మాయాబజార్ లా కనిపిస్తోందని విమర్శ

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో... ఏపీ కాంగ్రెస్ చీఫ్

మిగతా 2లో

➤చంద్రబాబూ.. ఈ హామీలన్నీ ఏమయ్యాయని ప్రజలు అడుగుతున్నారు

➤రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ప్రతి కుటుంబాన్నీ మోసం చేశారు

➤చెప్పిన మాటలకు.. చేసిన పనులకు ఏమాత్రం పొంతనే లేదు

➤ప్రతి క్షణం మోసం, దగా, స్కామ్‌ల మయం.. డీఎస్సీలోనూ అక్రమాలు

➤రెండేళ్లుగా పచ్చి అబద్ధాల ప్రచారం, మోసం, కక్ష సాధింపులు, వివక్ష, అరాచకాలు, రెడ్‌బుక్ పాలన

➤కుప్పకూలిన వ్యవస్థలు.. ఎవరికీ రక్షణ లేదు.. జంగిల్ రాజ్‌లా రాష్ట్రాన్ని నడుపుతున్నారు

➤అమరావతి నిర్మాణం పేరుతో అంతులేని అవినీతి.. అన్నింటా మాఫియాతో దోపిడీ

➤ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి.. పేదరికం బుసలు కొడుతోంది

### రెండేళ్ల నారాసుర పాలన..

## రాష్ట్రానికి, ప్రజలకు వెన్నుపోటు

**రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌గా మార్చారు**

**చెప్పిన మాటలకు.. చేసిన పనులకు ఏమాత్రం పొంతనే లేదు**

**సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ సహా 143 హామీలిచ్చారు**



ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ 143 హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు ఈ రెండేళ్లలో వాటిని అమలు చేయకుండా అటు రాష్ట్రానికి, ఇటు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండి పడ్డారు. రెండేళ్ల నారాసుర పాలన రాష్ట్రానికి, ప్రజలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ఇంటింటికీ బాండ్లు రాసిచ్చి మరీ

మిగతా 2లో

## ఏపీ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారుడు జగనే



⏩మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

⏩మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.

మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో

మిగతా 2లో

## జూలై 9న అయతోల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు!

ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీకి సంబంధించిన ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించే అంత్యక్రియల పూర్తి షెడ్యూల్‌ను ఇరాన్ అధికారులు ప్రకటించారు.అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడుల్లో ఖమేనీ మరణించినట్లు పేర్కొంటూ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఆయన అంత్యక్రియలను ఐదు రోజులపాటు వివిధ నగరాల్లో నిర్వహించనున్నారు. చివరగా జూలై 9న పవిత్ర నగరం మషద్‌లో ఖననం చేయనున్నట్లు వెల్లడించారు. ఇమామ్ ఆరోహణ స్మారక కమిటీ(ది కమిటీ ఫర్ ది కామెమొరేటివ్ అఫ్ ది అసెన్షన్ అఫ్ ది ముఖాహిద్ మార్టిర్ ఇమామ్) జూన్ 13న విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. జూలై 4, 5 తేదీలలో టెహ్రాన్‌లోని ఇమామ్ ఖోమేనీ మొసల్లాలో ప్రజల సందర్శనార్థం వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం జూలై 6న టెహ్రాన్ నగరంలో భారీ అంత్యక్రియల ఊరేగింపు జరుగుతుంది. జూలై 7న పవిత్ర నగరమైన ఖోమ్‌లో మరో ఊరేగింపు నిర్వహిస్తారు.ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ఇమామ్ సజ్జాద్ అమరత్వ దినానికి ముందు రోజు అయిన జూలై 9న మషద్‌లో తుది అంత్యక్రియలు జరుగుతాయి. ఈ కార్యక్రమం ఇమామ్ రెజా మందిరం వద్ద ఖననంతో ముగిస్తుందని అధికారులు తెలిపారు. ఖమేనీతో పాటు మరణించిన ఆయన కుటుంబ సభ్యులు కుమార్తె మిస్బా అల్-హుదా ఖమేనీ కనీ, సయ్యిదా బుష్రా హోస్సేనీ ఖమేనీ, జహ్రా హద్దాద్ అదెల్, జహ్రా మొహమ్మది గోల్పాయేగానిలను కూడా అదే వేడుకల్లో ఖననం చేయనున్నట్లు ప్రకటించారు. 1989లో ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు అయతొల్లా రుహొల్లా ఖోమేనీ మరణం అనంతరం సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన అలీ ఖమేనీ దాదాపు 35 ఏళ్లపాటు దేశానికి నాయకత్వం వహించారు. ఆయన మరణానంతరం మార్చి 4న అంత్యక్రియలు నిర్వహించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, ప్రాంతీయ ఘర్షణలు మరియు భద్రతా పరిస్థితుల కారణంగా కార్యక్రమాన్ని పలుమార్లు వాయిదా వేశారు.

## యుద్ధాన్ని ముగించేందుకు సమయం ఆసన్నమైంది మిత్రమా!

ఇరాన్‌తో శాంతి ఒప్పందం కేవలం మరికొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశముందని ఆయనకు తెలిపినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. "ఇది మంచి ఒప్పందం.. యుద్ధాన్ని ముగించే సమయం వచ్చేసింది" అని నెతన్యాహుకు ట్రంప్ చెప్పినట్లు సమాచారం.అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని ఇరు దేశాల అధికారులు చెబుతున్నారు. గతంలో ఇరాన్‌లో పాలన మార్పే లక్ష్యమని వాదించిన నెతన్యాహు.. ఇప్పుడు ట్రంప్ ముందుకు తీసుకెళుతున్న ఒప్పందాన్ని అడ్డుకోలేనటే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్ ఆందోళనలను ఒప్పందంలో పరిగణనలోకి తీసుకుంటారని ట్రంప్‌పై తనకు నమ్మకం ఉందని ఆయన చెప్పినట్లు అధికారులు వెల్లడించారు.అయితే ప్రతిపాదిత ఒప్పందంపై ఇజ్రాయెల్ పూర్తిగా సంతృప్తిగా లేదని సమాచారం. ఆంక్షల సడలింపుతో ఇరాన్ చమురు విక్రయాలు పెంచుకుని ఆర్థికంగా బలపడొచ్చని, అదే సమయంలో అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయకపోవచ్చని ఇజ్రాయెల్ వర్గాలు భావిస్తున్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ మాట్లాడుతూ.. అమెరికా తన ప్రయోజనాల దృష్ట్యా ఒప్పందం కుదుర్చుకుంటున్నప్పటికీ ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణులు, అనుబంధ తీవ్రవాద సంస్థల విషయంలో తమ భద్రతా ఆందోళనలను కాపాడాలని ఆశిస్తున్నామని చెప్పారు.న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం అమెరికా-ఇరాన్ మధ్య త్వరలో ఓ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరే అవకాశం ఉంది. ఇందులో 60 రోజుల కాల్పుల విరమణ, ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, అణు కార్యక్రమంపై తదుపరి చర్చలకు మార్గం సుగమం చేసే అంశాలు ఉండనున్నాయి. అలాగే హార్ముజ్ జలసంధిని తిరిగి పూర్తిగా తెరవడం, ఇరాన్ పోర్టులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది

## తిరుపతి సభ విజయోత్సవం కాదు.. వెన్నుపోటు ఉత్సవం

రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా విస్మరించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు విజయోత్సవాల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం "క్యాష్--రాజేష్--లోకేష్" ఫార్ములాతో పాలన సాగుతోందని విమర్శించిన ఆయన, డీఎస్సీ నుంచి సంక్షేమ పథకాల వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. తాడేపల్లిలోని వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో ఈ నెల 12న జరిగినది కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభ కాదు.. ఆరు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ. చంద్రబాబు రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు ఏంటో గూగుల్‌లో వెతికినా కనిపించడం లేదు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం పరీక్ష రాయకుండానే పాస్ అయినట్లు ఉంది. ఆ రోజు సూపర్ సిక్స్ అన్న చంద్రబాబు, ఈ రోజు సూపర్ సైలెంట్ అయ్యారు. ఎన్నికల మేనిఫెస్టోను మూసేసి ఎర్రబుక్ పాలన ప్రారంభించారు. రాష్ట్రంలో ఇప్పుడు ఏ పని జరగాలన్నా "క్యాష్--రాజేష్--లోకేష్" అనే కొత్త ఫార్ములాతో అమలవుతోంది. రాజేష్ స్కిల్ నేర్పే లోకేష్ దాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఇద్దరూ కలిసి రాష్ట్ర వ్యవస్థలను భ్రష్టు పట్టించారు.డీఎస్సీ -2025 వ్యవహారంలో వచ్చిన ఆరోపణలు ప్రెస్‌మీట్ పెట్టి సమాధానం చెప్పలేని వ్యక్తి మంత్రి ఎలా అవుతారు? డీఎస్సీ అక్రమాలపై వివరణ ఇవ్వలేని సకల విభా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రాష్ట్రాన్ని నడిపిస్తారా? అలాంటి వ్యక్తి విజయోత్సవ సభ వేదికపై నిలబడి మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ గారిని విమర్శించడం విడ్డూరంగా ఉంది. దూకుడు సినిమాలో బ్రహ్మానందం పాత్రను ఎలా ఉపయోగించారో, అలాగే చంద్రబాబు--లోకేష్‌లు పవన్ కళ్యాణ్‌ను ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగినప్పుడల్లా పవన్‌ను రంగంలోకి దింపుతున్నారు. ప్రశ్నించడానికి పార్టీ పెట్టానని చెప్పుకున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుతూ ప్రత్యర్థులను దూషించడానికే పరిమితమయ్యారు. ఫ్లెక్సీ పవిత్రబిల్లు నుంచి రైతుల వరకు ప్రతి వర్గాన్ని మోసం చేసి వెన్నుపోటు పొడిచారు. తిరుపతిలో నిర్వహించిన సభ విజయోత్సవ సభ కాదు.. ఆరు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ అని వారి ప్రసంగాలే నిరూపించాయి.

## ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొనేలా సన్నద్ధమవ్వండి

దిశానిర్దేశం చేశారు. 28 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో గంటల తరబడి సుదీర్ఘంగా మోదీ సమావేశమై పలు అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించి ఫిర్యాదులు, అభిప్రాయాలను స్వీకరించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వార్షిక సమావేశంలో 28 రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా సీఎంలనుద్దేశించి ఆయా రాష్ట్రాల్లో చేపట్టాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధానాలపై మోదీ ప్రసంగించారు. "గోప్యత, పారదర్శకత, సామాజిక విలువలను పాటిస్తూనే కృత్రిమ మేధను విరివిగా ఉపయోగించండి. ఏఐతో అందివచ్చే అవకాశాలను ఒడిసిపట్టండి. అత్యంత తీవ్రమైన ఎల్ నినో వాతావరణ ఉపద్రవాన్ని తట్టుకునేలా విధానపర నిర్ణయాలు తీసుకోండి. నీటి సంరక్షణ చర్యలు చేపట్టండి. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూనే పలు రంగాల్లో దేశం ఆత్మనిర్భరత సాధించేందుకు కృషిచేయండి. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగంలో స్వావలంబనకు బాటలువేయండి. పలు దేశాలతో భారత్ కొత్త వాణిజ్య ఒడంబడికలు చేసుకుంది. ఈ మేరకు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా సూక్ష్మ,మధ్యతరహా పరిశ్రమల పునరుజ్జీవనానికి పాటుపడండి. తద్వారా ఆయా రంగాల భాగస్వామ్యంతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించండి. సమాఖ్య స్ఫూర్తిని మరోసారి చాటండి. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయానికి పాటుపడండి. అప్పుడే రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెంది దేశం సారాముపుతుంది. 'వికసిత్ భారత్'ఆవిర్భావం కోసం అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, బ్లాక్‌లు, గ్రామ సంకల్పం తీసుకోవాలి. పౌర అనుగామన, సుపరిపాలన ద్వారా మాదకద్రవ్యాల వినియోగాలు, సైబర్ నేరాలు వంటి వాటిని కట్టడిచేయండి. చక్కటి పరిపాలన, పారదర్శకత, మౌలిక వసతుల కల్పనతో పెట్టుబడులను ఆకర్షించవచ్చు. స్థానిక ఉత్పత్తుల బ్రాండింగ్‌పై దృష్టిపెట్టండి. సులభతర వాణిజ్యానికి తగ్గట్టు విధానపర నిర్ణయాలు తీసుకోండి. డేటా సెంటర్లు, కృత్రిమ మేధ వంటి రంగాల్లో కొత్త అవకాశాలను ఒడిసిపట్టండి. నవతరం ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యతనివ్వండి. భవిష్యత్ ఆర్థికవ్యవస్థకు నిపుణ మానవవనరుల అవసరం అత్యావశ్యకం. ఏదైనా ఆ కోణంలో అవకాశాల గనిగా భావించండి. మన 70 కోట్ల యువత మనకు అతిపెద్ద ఆస్తి. ఇంకాకెప్పుడు ఆర్థిని దేశాభివృద్ధి ఫలాలిచ్చే ఆదాయ వృక్షంగా మార్చండి. దేశంలో రక్షణరంగ ఉపకరణాల తయారీ రంగం వేగంగా విస్తరిస్తోంది. తగు మౌలికవసతులను కల్పించి ఈ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచండి. జిల్లాల్లో విభిన్న ఉత్పత్తి తరహాలో ఎగుమతుల లక్ష్యంగా వ్యూహాల రచించండి"అని రాష్ట్రాలకు మోదీ సూచించారు.

## కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు

వైఎస్ షర్మిల ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన 'సూపర్ సిక్స్' వాగ్దానాలు రెండేళ్ల పాలనలో పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయ్యాయని ఆమె దుయ్యబట్టారు.రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని, కేవలం అప్పులు చేయడంలోనే ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని షర్మిల ఎద్దేవా చేశారు. 'పబ్లిసిటీ పీక్.. పాలన వీక్', 'అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్' అని విమర్శించారు. ప్రస్తుత పరిపాలన అంతా ఒక 'మాయాబజార్‌'లా కనిపిస్తోందని, ప్రజలను భ్రమల్లో ముంచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తామన్న హామీ ఏటు పోయిందని నిలదీశారు.బట్టెడు అప్పులు ఉన్నా, ప్రజల నుంచి ఓట్లు దండుకున్న ఎన్డీయే నేతలు, అధికారంలోకి వచ్చాక కేవలం గుప్పెడు హామీలను కూడా సరిగ్గా అమలు చేయలేకపోయారని ఆరోపించారు. ప్రజలను దారుణంగా వంచించింది ఈ ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

## ఏపీ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారుడు జగనే

విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు. చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు.కల్తీ మద్యం ద్వారా దోచుకున్న సొమ్ముతో సినిమాలు, వ్యాపారాలు చేశారని మంత్రి తెలిపారు. వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం రవాణా దోపిడీ చేశారని ఆరోపించారు. డొల్ల కంపెనీల ద్వారా రవాణా ఛార్జీలు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిందన్నారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్లు ఊడే బిడ్ చేసిందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసి వేశారని డోలు బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించారు.

# వికసిత్ భారత్ నిర్మాణమే మన లక్ష్యం

మన దేశంలో విద్య, ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అత్యుత్తమ మేధావుల మధ్య విశాఖపట్నంలో ఉండటం ఆనందంగా ఉంది. ఈ సభను చూస్తుంటే సంస్థలను తీర్చిదిద్దుతూ, అవకాశాలను సృష్టిస్తూ, ప్రతిభను పెంపొందిస్తూ కోట్లాది భారత యువత జీవితాలను ప్రభావితం చేస్తున్న నాయకులు కనిపిస్తున్నారు. మన పాత్రలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. మన లక్ష్యం ఒక్కటే. బలమైన భారతదేశ నిర్మాణం మన లక్ష్యం. విద్యారంగంలో భాగస్వామ్యం కావడానికి ఇంతకంటే అద్భుతమైన సమయం మరొకటి లేదు.

నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది

ప్రపంచం అత్యంత వేగంగా మారుతోంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిశ్రమలను మార్చేస్తోంది. సాంకేతికత ఉద్యోగాలను పునర్ నిర్వచిస్తోంది. అనేక రంగాలు పూర్తిగా కొత్త రూపు దాలుస్తున్నాయి. ఈ వేగవంతమైన ప్రపంచంలో ఏ రాష్ట్రానికైనా, ఏ దేశానికైనా అత్యంత పెద్ద పోటీ సామర్థ్యం భూమి, సహజ వనరులు లేదా మూలధనం కాదు.. ప్రతిభ. అందుకే ఈ చర్చ విశాఖలో జరగడం ప్రత్యేక ఆనందాన్ని కలిగిస్తోంది. దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని అత్యుత్తమ ప్రతిభను అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ దశాబ్దాలుగా ఐటీ రంగంలో ముందంజలో నిలిచింది. చంద్రబాబు గారు తన తొలి, రెండో పదవీకాలాల్లో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా సిలికాన్ వ్యాలీ నుంచి సింగపూర్ వరకు, లండన్ నుంచి దుబాయ్ వరకు ఎక్కడ చూసినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన నిపుణులు.. బృందాలకు నాయకత్వం వహిస్తూ, సంస్థలను నిర్మిస్తూ, పరిశోధనలను ముందుకు తీసుకెళ్తూ, ఆవిష్కరణలకు మార్గనిర్దేశం చేస్తూ కనిపిస్తారు. మన గొప్ప ఎగుమతి ఏదైనా ఉత్పత్తి కాదు. అది మన ప్రజలు. సుసంపన్న భవిష్యత్తును నిర్మించాలంటే వారిపై పెట్టుబడి పెట్టడం మన తొలి బాధ్యత కావాలి.

విద్య ద్వారానే తదుపరి తరం నాయకులను ప్రేరేపించే అవకాశం

చాలామంది నన్ను ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రిగా గుర్తిస్తారు. అది నా ఇండియా హ్యాట్. నేను మరో టోపీ కూడా ధరిస్తాను. దానిని నేను భారత్ హ్యాట్ అని పిలుస్తాను. అదే నా విద్యాశాఖ బాధ్యత. ముఖ్యమంత్రి గారు శాఖల కేటాయింపుల సమయంలో నేను ఏ శాఖను కోరుకుంటానని అడిగినప్పుడు విద్యాశాఖ ఇవ్వాలని కోరాను. ఆ నిర్ణయం వెలువడినప్పుడు చాలామంది విద్యాశాఖ వద్దని వారించారు. సంఘాలు, ఆరోపణలు, ప్రశ్నాపత్రాలు, మూల్యాంకనాలు, వివాదాలు వంటి అనేక సవాళ్లు ఉంటాయని చెప్పారు. నేను మాత్రం అందుకే ఆ శాఖ అంటే ఇష్టం అని చెప్పా. ఎందుకంటే తదుపరి తరం నాయకులను ప్రేరేపించే అవకాశం విద్య ద్వారానే లభిస్తుంది. అందుకే నేను హెచ్‌ఆర్‌డీ శాఖను ఎంచుకున్నాను. పిల్లలను నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తాను. వారు చూపే ప్రేమ, ఆప్యాయత, నిజాయితీ నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయి. అందుకే విద్యారంగం పట్ల నాకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది.

ఏపీలో నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధానత్య ఇస్తున్నాం

అయితే నా దృష్టిలో విద్య అంటే కేవలం డిగ్రీ సర్టిఫికేట్ ఇవ్వడం కాదు. జీవితాంతం నేర్చుకునే ప్రక్రియలో ప్రభుత్వం, మనమందరం కలిసి భాగస్వాములు కావాలి. అందుకే మరో రెండు వారాల్లో నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభించబోతున్నాం. పెద్దఎత్తున నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారుచేయగల రాష్ట్రాలదే భవిష్యత్. అందుకే ఏపీ వృద్ధి వ్యూహంలో నైపుణ్యాభివృద్ధి అత్యంత కీలకమైన అంశంగా ఉంది. మేం నిన్నటి ఉద్యోగాల కోసం విద్యార్థులను సిద్ధం చేయడం లేదు. ప్రస్తుతం సరికొత్తగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్ వంటి రంగాల కోసం వారిని సిద్ధం చేస్తున్నాం. ఇక్కడే విద్య, ఆర్థికాభివృద్ధి ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయి.

ఏఐ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాల కల్పన

ఈ రోజుల్లో విశ్వవిద్యాలయాలు కేవలం విద్యను బోధించే సంస్థలు మాత్రమే కాదు. అవి ప్రతిభను తీర్చిదిద్దే కేంద్రాలు, పరిశోధనకు చోదక శక్తులు, ఆవిష్కరణలకు వేదికలు, స్టార్టప్‌ల ఆవిర్భావానికి పునాదులుగా మారాయి. ప్రపంచంలో అత్యుత్తమ విద్యాసంస్థలు టాలెంట్, నాలెడ్జ్, ఎంటర్ ప్రెన్యూర్స్ ను తయారుచేస్తాయి. ఈ మూడు లక్ష్యాలను సాధించగల సంస్థలతో భాగస్వామ్యం వహించడానికి ఏపీ సిద్ధంగా ఉంది. మా లక్ష్యం కేవలం పట్టభద్రులను తయారు చేయడం కాదు.. ప్రపంచస్థాయి పోటీకి తగిన పరిశోధన ఆధారిత, ఆవిష్కరణలతో నడిచే సంస్థలను నిర్మించడమే మా లక్ష్యం. ఏఐ యూనివర్సిటీలను రీప్లేస్ చేయలేదు. అయితే ఏఐను స్వాగతించే యూనివర్సిటీలే భవిష్యత్ ను శాసిస్తాయి. ప్రతి పారిశ్రామిక విప్లవం ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించింది. ఏఐ విషయంలో కూడా అదే జరుగుతుందని నమ్ముతున్నాను. ఏఐ ఆధారిత విద్య, పరిశోధన, పాలన, ఆవిష్కరణలకు ఏపీ ఒక ప్రయోగశాలగా మారాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో డేటా సెంటర్లు, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు అత్యంత కీలకమైనవి. ఇకపై దేశ సంపద చమురు నిల్వలతో కాదు.. కంప్యూటింగ్ సామర్థ్యంతో లెక్కిస్తారు. ఆ దిశలో భారతదేశానికి మార్గదర్శకంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలని మేము భావిస్తున్నాం. ఈ ప్రయాణంలో ఈ సభలో ఉన్న సంస్థలు కీలకపాత్ర పోషించాల్సి ఉంది. పెట్టుబడిదారులకు అవసరమైన ఎకోసిస్టమ్ ను ఏపీ నిర్మిస్తోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, బ్రాండ్ సీబీఎన్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఏపీ ప్రత్యేకతలు. వృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, సమగ్ర అభివృద్ధి వంటి లక్ష్యాల పట్ల ఉమ్మడి నిబద్ధతతో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయి. ఈ సమన్వయమే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన ప్రయోజనాన్ని అందిస్తోంది. దాని ఫలితాలు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. గూగుల్ సంస్థ భారతదేశంలోనే అతిపెద్ద ప్రత్యక్ష విదేశీ పెట్టుబడి ఏపీలో పెట్టబోతోంది. ఇందుకు కేవలం 13 నెలల సమయం మాత్రమే పట్టింది. ఒక్క జూమ్ కాల్ ద్వారానే ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ సాధించగలిగాం. నిర్మాణ పనుల ప్రారంభానికి కేవలం 17 నెలలే పట్టింది. ఏపీలో ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ కోసం 36 రోజుల్లోనే 600 ఎకరాలు అప్పగించాం. ఒక్కసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్.దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. స్పష్టమైన లక్ష్యం, దూరదృష్టి, వేగంతో ఏపీ ముందుకు సాగుతున్నందునే ఇది సాధ్యమవుతోంది. గాజు తయారీ, డ్రోన్లు, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్, ద్విచక్ర వాహనాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ వంటి అనేక రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయి.

# రెండేళ్ల నారాసుర పాలన.. రాష్ట్రానికి, ప్రజలకు వెన్నుపోటు

మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పిన మాటలకు, ఈ రెండేళ్లలో చేసిన పనులకు ఏమాత్రం పొంతన లేదని చెప్పారు. నిత్యం మోసాలు, రాజకీయ కక్ష సాధింపులు, వివక్ష, అరాచకాలు, రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌గా మార్చారని నిప్పులు చెరిగారు. చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్ల పాలన వైఫల్యంపై శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున నిరసన ర్యాలీలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు, చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో మోసపోయిన, దగా పడిన యువత, మహిళలు, విద్యార్థులు, రైతులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబు ప్రభుత్వ విధానాలపై నిరసన గళం వినిపించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకాలపై వైఎస్ జగన్ శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజాగ్రహానికి అద్దం పట్టిన వైఎస్సార్‌సీపీ ప్రజలతో కలిసి నిర్వహించిన ర్యాలీల ఫొటోలను ట్యాగ్ చేశారు. ఈ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..రెండేళ్ల క్రితం నారా చంద్రబాబు నాయుడు ప్రజల ముందుకు వచ్చి ఎన్నో హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్ అన్నారు.. సూపర్ సెవెన్ అన్నారు.. మొత్తం 143 హామీలు తన మేనిఫెస్టోలో.. బాండ్ల రూపేనా పెట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఈ బాండ్లు ఇచ్చారు. కానీ ఈ రోజు రాష్ట్ర ప్రజలు ఒకటే ప్రశ్న అడుగుతున్నారు. ఆ హామీలు ఏమయ్యాయి చంద్రబాబూ అని అడుగుతున్నారు.రైతులను మోసం చేశారు. మహిళలను మోసం చేశారు. యువతను మోసం చేశారు. విద్యార్థులను మోసం చేశారు. చివరకు ప్రతి కుటుంబాన్నీ మోసం చేశారు. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన పనులకు ఏమాత్రం పొంతనే లేదు. ప్రతి క్షణం మోసం, దగా, స్కామ్‌ల మయమే. ఈ రెండేళ్లలో రాష్ట్రం చూసింది అభివృద్ధి కాదు. పచ్చి అబద్ధాల ప్రచారం. సంక్షేమం కాదు.. రాష్ట్ర ప్రజలు చూసింది మోసం. ప్రజా పాలన కాదు.. రాజకీయ కక్షసాధింపులు, వివక్ష, అరాచకాలు, రెడ్‌బుక్ రాజ్యాంగంతో భయానక పాలన.వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. మహిళలకు, చిన్నారులకు రక్షణ అనేదే లేదు. పోలీసు సహా అన్ని వ్యవస్థలనూ భ్రష్టు పట్టించారు. శాంతిభద్రతలను దారుణంగా దెబ్బ తీశారు. జంగిల్ రాజ్‌లా రాష్ట్రాన్ని నడుపుతున్నారు. సొంత ప్రజలపై కక్షగట్టిన నాయకుడిని ఏమంటాం?అమరావతి నిర్మాణం పేరుతో అంతులేని అవినీతి. ఇసుక, మట్టి, లిక్కర్, క్వార్ట్జ్, లేటరైట్ అన్నింటిలోనూ మాఫియా నడుపుతూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు.మరోవైపు ప్రజలపై భారం మాత్రం రోజు రోజుకూ పెరుగుతోంది. కరెంటు చార్జీలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్, బస్సు చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. పన్నులు పెరిగాయి. కానీ ప్రజల ఆదాయం మాత్రం పెరగలేదు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులతో సతమతమవుతోంది. దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. పేదరికం బుసలు కొడుతోంది. విద్యా రంగం దెబ్బతింది. వైద్య రంగం దెబ్బతింది. వ్యవసాయం సంక్షోభంలో ఉంది. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఆశ చూపించారు. కానీ డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు, అవకుతవకలు, స్కామ్‌లతో యువత భవిష్యత్తును దారుణంగా దెబ్బతీశారు. ఉద్యోగాలు ఇవ్వలేకపోయారు. ఉపాధి అమకాశాలు కల్పించలేకపోయారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌లో చెప్పిన హామీలు మోసాలుగా మార్చారు. ప్రచార కార్యక్రమాలకు మాత్రం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ రోజు రాష్ట్రంలో ఏ వర్గాన్ని అడిగినా అసంతృప్తే కనిపిస్తోంది. ఏ కుటుంబాన్ని కలిసినా మోసపోయామనే బాధ వినిపిస్తోంది. ప్రతి ఇంట్లో చంద్రబాబు ప్రభుత్వ మోసాలు, వైఫల్యాల గురించే చర్చ జరుగుతోంది. అందుకే ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలు ప్రజల ఆవేదనకు, ఈ ప్రభుత్వం పట్ల వ్యతిరేకతకు అద్దం పట్టాయి. ప్రజల ఆగ్రహానికి ప్రతీకగా నిలిచాయి. ఈ పోరాటంలో ప్రజలకు తోడుగా పాల్గొన్న ప్రతి నాయకుడికి, ప్రతి కార్యకర్తకు, యువతకు, ప్రజలకు నా హృదయ పూర్వక అభినందనలు. చంద్రబాబుకు ఒక్కటే చెప్పాలనుకుంటున్నా. అబద్ధాలతో కొంత కాలం ప్రజలను మోసం చేయొచ్చు. కానీ ఎప్పటికీ మోసం చేయలేరు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ప్రతి హామీని గుర్తుంచుకున్నారు. ప్రతి మోసాన్నీ లెక్కపెడుతున్నారు. ఈ 'నారాసుర పాలన'కు వ్యతిరేకంగా ప్రజల తరఫున మా పోరాటం ఆగదు. మోసాలను నిలదీస్తాం.అన్ని వర్గాల అండతో, ప్రజాబలంతో, దేవుడి దయతో ఈ దుర్మార్గపు ప్రభుత్వం గద్దెదిగక తప్పదు.షబ్బీర్ అలీ సాబ్ నిన్న నిజాయితీగా చెప్పిండు.. కాంగ్రెస్ పార్టీలో పైసలు తీసుకొని అన్ని అమ్ముకుంటున్నరని చెప్పిండు. వాస్తవం అన్నారు.

# హామీలన్నీ ఉల్లంఘించి ప్రజలను, యువతను, రైతులను జగన్ మోసం చేశారు.

బ్రాండ్ అంబాసిడర్" అని ఆయన అభివర్ణించారు. శనివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ ఐదేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు.ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డగోలు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ తుంగలో తొక్కిన దుర్మార్గుడు జగన్ అని రవీంద్ర విమర్శించారు. సొంత బాబాయి హత్య కేసులో నిందితులకు కొమ్ముకాస్తూ, తోడబుట్టిన చెల్లిపైనే నిందలు వేసిన నీచమైన మనస్తత్వం జగన్‌ది అని ఆరోపించారు. ఆయన ఐదేళ్ల అరాచక పాలన, మోసపూరిత వైఖరిని చూసిన ప్రజలు 'ఈ సైకో మాకొద్దు' అంటూ ఎన్నికల్లో కూటమికి 94 శాతం సీట్లు కట్టబెట్టారని గుర్తుచేశారు. కేవలం 11 సీట్లకే పరిమితమైనా సిగ్గులేకుండా ఇంకా కుట్రలనే నమ్ముకుని, ప్రజాసంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ప్రభుత్వంపై నీచమైన కుతంత్రాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.జగన్ తన పాలనను ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించారని, సంపూర్ణ మద్యపాన నిషేధం హామీని గాలికి వదిలేసి, కల్తీ బ్రాండ్లు, సొంత కంపెనీల మద్యంతో ప్రజల జేబులు కొల్లగొట్టి తాడేపల్లి ప్యాలెస్ ఖజానా నింపుకున్నారని ఆరోపించారు. ఈ కల్తీ మద్యం కారణంగా రాష్ట్రంలో సుమారు 30 వేల మంది మహిళలు మాంగళ్యాలు కోల్పోయారని, లక్షలాది మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచి రూ.32 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని, పీపీఏలు రద్దు చేసి విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్ల నష్టం కలిగించారని విమర్శించారు.మెగా డీఎస్సీ, ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ యువతను దారుణంగా మోసం చేశారని, జగన్ రెడ్డి దగాకోరు మాటల వల్ల గత ఐదేళ్లలో 4100 మంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కొల్లు రవీంద్ర ఆరోపించారు.'అమ్మఒడి' పథకాన్ని కొందరికే పరిమితం చేసి విద్యార్థులను, జీవో నెం.117తో పేదలకు పాఠశాలలను దూరం చేసి బడుగు బలహీన వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచారని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆ జీవోను రద్దు చేసిందని గుర్తుచేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన వందలాది సంక్షేమ పథకాలను రద్దు చేసి, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు కుదించి ఆ వర్గాలకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు.అమరావతే రాజధాని అని చెప్పి, గెలిచాక మూడు రాజధానుల నాటకంతో రాష్ట్రాన్ని, రైతులను మోసం చేశారని అన్నారు. పొరుగు రాష్ట్ర ప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ఆస్తిలో వాటా అడిగినందుకు చెల్లిని, ఆమెకు అండగా నిలిచిన కన్నతల్లిని ఇంటి నుంచి గెంటేసిన వ్యక్తి జగన్ అని, ఆయన లాంటి క్రూర మనస్తత్వం ఉన్న వ్యక్తిని రాజకీయంగా సమాధి చేయాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు.

# విద్యాశాఖను చెడగొట్టాలని లోకేశ్‌కు ఆ శాఖ అప్పగించారా ?

ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు."విద్యాశాఖను చెడగొట్టాలని లోకేశ్‌కు ఆ శాఖ అప్పగించారా ధరలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబబందులు పడుతున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఉందా కూటమి ప్రభుత్వ వెన్నుపోట్లపై పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాం. భవిష్యత్తులో ఇలాంటి పోరాటాలు మరిన్ని చేయాల్సిన అవసరం ఉంది. రెండేళ్లలో ఏదో సాధించినట్లు వెన్ను పోటీ పార్టీ చెప్పుకుంటోంది. ఇచ్చిన హామీలను ఈ రెండేళ్లలో ఒక్కటైనా నెరవేర్చారా సూపర్-6, సూపర్-7 పథకాలు అన్నారు.. ఏమయ్యాయి" అని బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు."ఏపీలో ఒక్క నిమిషం కూడా ఈ ప్రభుత్వం ఉండటానికి వీల్లేదు. చంద్రబాబు చాలా బేల మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం నడపమంటే మాపై ఆరోపణలు చేస్తున్నారు. పార్టీ పిలుపు మేరకు మా నాయకులు, ప్రజలు 'వెన్నుపోటుకు రెండేళ్లు' పోరాటంలో పాల్గొన్నారు.. పార్టీ నాయకులు అందరికీ అభినందనలు తెలుపుతున్నాను. ఆడబిడ్డ నిధి పథకాన్ని పూర్తిగా ఎత్తేశారు. బంగారు కుటుంబం అన్నారు.. ఇత్తడి కుటుంబం కూడా లేదు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందుకే వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాలకు ఇంతటి ప్రజాధరణ వచ్చింది. అన్నిటి ధరలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం వత్తాసు పలుకుతున్న దళారులు బాగుపడుతున్నారు.సామాన్యులు కొనే నిత్యావసరాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. లోకేశ్ ఛాలెంజ్ లు దేనికి విద్యా శాఖను బాగు చెయ్యడానికా నాశనం చెయ్యడానికా.. పాఠశాలల ప్రారంభం నాటికే పేద పిల్లలకు బూట్లు, పుస్తకాలు, బట్టలు, బ్యాగ్ ఇచ్చే వాళ్లం. ఇప్పుడు రాష్ట్రంలో అలాంటి పరిస్థితి లేదు. రాష్ట్రంలో ఏ రంగానికీ మంచి జరగడం లేదు. రైతుకు మద్దతుగా ధర లేదు. జొన్న, మామిడి వంటి వాటికి కూడా ధర లేదు. మా హయాంలో ఆక్వా రంగానికి ఇబ్బంది లేకుండా చేశాం. ఇప్పుడు ఆక్వా రంగం పూర్తిగా కుదేలు అయ్యింది.. ఆక్వా రంగంలో ఉన్న వారు కూడా రోడ్డెకుతున్నారు. ఇది వెన్నుపోటు పార్టీ విధానం" అన్నారు.ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని బొత్స సత్యనారాయణ చెప్పారు. "మీ కేంద్ర మంత్రే మా వల్ల స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని చెప్పారు. కేంద్ర మంత్రి కుమారస్వామి మాటలు అబద్ధమా.. లక్షలాది మంది ప్రజల సాక్షిగా ప్రధానిని స్టీల్ ప్లాంట్ కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగారు.. పవన్ కల్యాణ్.. ఒకరోజు తెలంగాణ.. మరో రోజు ఏపీ అంటారు.పవన్ ఏం మాట్లాడుతారో ఆయనకే తెలియదు. మేము 5 సంవత్సరాల్లో చేసిన అప్పు మీరు రెండేళ్లలో చేశారు. మా గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేశారు. మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి డీఎస్సీ సక్రమంగా నిర్వహించలేదు. డీఎస్సీని నిర్వహించలేని ప్రభుత్వం ఇది. గ్రామ సచివాలయ ఉద్యోగాలు పాదర్శకంగా ఇచ్చాం.. నేనే మానిటరింగ్ మినిస్టర్ గా ఉన్నాను గర్వంగా చెబుతున్నా. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది.

# అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి.. హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం

వారి వైద్య చరిత్రను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఓపీ సేవల నుంచి స్పెషలిస్ట్ వైద్య సేవల వరకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాంప్రదాయ వైద్య విధానాల నుంచి 'ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్' విధానంలోకి అడుగుపెట్టామని మంత్రి చెప్పారు. అంటే.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, అది రాకముందే గుర్తించేలా వ్యవస్థను మార్చామన్నారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, దీనివల్ల వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే టెలిమెడిసిన్ ద్వారా రోగుల సందేహాలకు నిపుణులైన వైద్యులతో సమాధానాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగాయని.. అందుకే ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సత్యకుమార్ అన్నారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఆసుపత్రుల్లోని గణాంకాలే నిదర్శనమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధనలో 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని చెబుతూ.. ఈ మార్పునకు సహకరించిన వైద్య సిబ్బందికి, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.హాజరు కాకపోవడంపై బండి సంజయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాత్రమే ఉండటంతో.. 'ఎస్పీ ఎందుకు రాలేదు?' అని ప్రశ్నించారు. తాను సాధారణ కార్యకర్తను కాదని, కేంద్రమంత్రిగా పాల్గొంటున్న కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకు?' అని ప్రశ్నించారు. అవసరమైతే బీఆర్ఎస్‌లో చేరాలని వ్యంగ్యంగా అన్నారు. అధికార యంత్రాంగం రాజకీయ పక్షపాతం లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ ఆదేశించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రజాక్షేత్రంలో పర్యటించారు. హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో పర్యటించిన అనంతరం, ఆయన కరీంనగర్ వైపు వెళ్లేందుకు స్థానిక ఆటోలో ఎక్కారు. ప్రయాణంలో భాగంగా ఆటో డ్రైవర్ దిలీప్‌తో ముచ్చటిస్తూ మోదీ పాలనపై ఆయన అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. "ఉచిత బియ్యం, గ్యాస్, రోడ్లు, గ్రామాభివృద్ధికి నిధులు ఇలా మోదీ పాలన పేదలకు ఎంతో మేలు చేస్తోంది" అని డ్రైవర్ పేర్కొనగా, కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని సైతం బండి సంజయ్ ఆరా తీశారు.కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అదిరిపోయే శుభవార్త చెప్పారు. గత ఏడాది లాగే ఈ ఏడాది కూడా 'మోదీ గిఫ్ట్' పేరుతో ప్రభుత్వ స్కూళ్లలో 10వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

# హుసేనాపురం గ్రామంలో జలదుర్గం పోలీసుల 'పల్లె నిద్ర'







## గ్రామస్తులతో మమేకమైన ఎస్.ఐ. మరియు సిబ్బంది...

## సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన...

ప్యాపిలి జూన్ 13 (సీమ కిరణం న్యూస్) : జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు సైబర్ క్రైమ్ నేరాలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐ పి ఎస్ ఆదేశాల మేరకు జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని హుసేనాపురం గ్రామంలో పోలీసులు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. జలదుర్గం ఎస్సై డి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామంలో రాత్రి బస చేసి, గ్రామస్తులతో నేరుగా మమేకమయ్యారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి నుండి స్థానిక భద్రతకు సంబంధించిన పలు కీలక సమాచారాలను సేకరించారు.ఈ సందర్భంగా గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన సదస్సులో ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో సాంకేతికతతో పాటు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల మరియు రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ.. సిబిఐ, ఇడి లేదా పోలీస్ అధికారులమంటూ భయపెట్టి ఫోన్ కాల్స్ ద్వారా చేసే 'డిజిటల్ అరెస్ట్' మోసాలకు ఎవరూ లొంగకూడదని, చట్టంలో అలాంటి అరెస్టులు లేవని స్పష్టం చేశారు.తెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఓటీపీలు చెప్పకూడదని.. వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను (ఏ పి కే ఫైల్స్) క్లిక్ చేసి యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు.ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసిగాని **www.cybercrime.gov.in** అనే వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని, తద్వారా పోగొట్టుకున్న సొమ్మును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇది మీ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా ముప్పని హెచ్చరించారు. మైనర్లకు, (పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలకు) వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్.ఐ. కోరారు. ఈ కార్యక్రమంలో హుసేనాపురం గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒలింపిక్ డే ఉత్సవాలను జయప్రదం చేద్దాం

## ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి. శంకర్ శర్మ




కల్లూరు, జూన్ 13, (సీమకిరణం న్యూస్) : ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఒలింపిక్ డే ఉత్సవాలను జయప్రదం చేద్దామని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి. శంకర్ శర్మ పిలుపునిచ్చారు.శనివారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియం హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత 20 సంవత్సరాలుగా నిర్విరామంగా రాష్ట్రంలో ఎక్కడిలేని విధంగా సంబరాలను నిర్వహించటం అది జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కి చెందుతుందని ఆయన కితాబిచ్చారు. క్రీడారంగంలో నిర్వాహకులు శక్తులుగా మారాలని ఆయన సూచించారు. అలాంటి సందర్భంలోనే రాటు తేలిన క్రీడాకారులను మల్చవచ్చు అన్నారు. ఏపీ ఎస్పీ డిఎస్పి ఎస్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఈ సంబరాల్లో పోలీసు రెవెన్యూ ,జర్నలిస్టు, అడ్వకేట్స్ కు పోటీలను నిర్వహించటం వారిని మిలితం చేయటం క్రీడారంగం బలోపేతం అవుతుందని ఆయన సూచించారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు రామాంజనేయులు సురేంద్ర మాట్లాడుతూ పోటీల విజయవంతానికి సహకరిస్తున్న క్రీడాశంగా ప్రతినిధులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రీడాకారులకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎనిమిది రోజులపాటు వీలైనంత క్రీడాంశాల్లో అంతర్ పాఠశాలల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘ ప్రతినిధులు హర్షవర్ధన్, షేక్షావలి, జాఫర్ మున్నా, విజయ్ కుమార్, చిన్న శంకన్నా సురేంద్ర, పరశురాముడు చంద్రయ్య శేషన్న, గంగాధర్, శ్రీనివాసులు, సువర్ణ ప్రణీత్, ఇంద్ర, మురళి, ఫరూక్, రాఘవేంద్ర, సుందర్, ప్రభాకర్, రాము, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత వైపు సమిష్టి అడుగులు

**జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి**

**ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో ప్రతి వార్డులో పరిశుభ్రత ముద్ర**







కర్నూలు (సీమకిరణం న్యూస్) : జూన్ 12 : నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' నాలుగో వారపు కార్యక్రమాలను శనివారం నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఓల్డ్ కల్లూరు కురువ వీధిలో ప్రజా మరుగుదొడ్ల శుభ్రత, ముజఫర్ నగర్‌లో గార్బేజ్ పాయింట్‌ను నర్సరీగా అభివృద్ధి చేసిన ప్రాంతంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛత అనేది కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ, హానికర వ్యర్థాలను వేర్వేరుగా అందించడం, చెత్తను రహదారులపై వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా స్వచ్ఛ నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషితోనే ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన నగరాన్ని నిర్మించగలమన్నారు.గత నాలుగు వారాలుగా వివిధ అంశాలపై ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి ప్రతి వార్డులో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ముద్ర వేయడం జరిగిందన్నారు. నగర పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. గత నాలుగు వారాలుగా ప్రతి శనివారం ప్రత్యేక థీమ్‌తో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రహదారులు, జంక్షన్లు, రెడ్-యెల్లో స్పాట్ల శుభ్రత, కాలువలు, డ్రైన్లు, వీధుల పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణపై అవగాహన, మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగర శుభ్రత కోసం ప్రభుత్వం, నగరపాలక సంస్థ, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, కుర్మయ్య, ఎంజల్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

# యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక







## శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగుపరచడం లో యోగా ది కీలకపాత్ర

## జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

కర్నూలు, (సీమకిరణం న్యూస్) : జూన్ 13:- యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహిస్తున్న పర్యాటక యోగ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ శారీరక, మానసిక ఆరోగ్యాభివృద్ధి కోసం యోగాను స్వచ్ఛందంగా అలవాటు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలందరూ యోగాంధ్రలో నమోదు చేసుకుని జూన్ 21న నిర్వహించే మెగా యోగా కార్యక్రమంలో పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ కోరారు. రోజుకు కనీసం 10 నిమిషాల పాటు ప్రాణాయామం చేసినా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు.. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, టూరిజం అధికారి లక్ష్మీ నారాయణ, జిల్లా లేప్రసీ అధికారి డా.భాస్కర్ రాజు, డిఈఓ సుధాకర్, మెప్మా పిడి శ్రీనివాసులు, డిఎస్డిఓ భూపతి రావు, యోగంధ్ర ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డా. అమర్నాథ్, ఆయుష్ మెడికల్ అధికారి చంద్రిక, సీనియర్ వైద్యులు డా. కే. వి.ఎన్ ప్రసాద్, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్, జిల్లా యోగ సంఘం ప్రధాన కార్యదర్శి మునిస్వామి, నేషనల్ యోగ జడ్జి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బేడ బుడగ జంగాల విద్యార్థులకు హాస్టల్ సీట్లు కేటాయించాలి





వెల్దుర్తి, జూన్ 13,(సీమకిరణం న్యూస్): వెల్దుర్తి మండల కేంద్రంలో బేడ బుడగ జంగాల విద్యార్థిని, విద్యార్థులకు న్యాయం చేసి ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు కేటాయించాలని కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల బేడ బుడగ జంగాల సంఘం అధ్యక్షుడు విభూది బాలు కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భిక్షాటన వృత్తిని ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న బేడ బుడగ జంగాల కులస్థులు అత్యంత నిరుపేదలుగా ఉన్నారని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ కులానికి ఎస్సీ హోదా కల్పించగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం జీవో నెం.147 కారణంగా దశాబ్దాలుగా ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బేడ బుడగ జంగాల సమస్యలను అర్థం చేసుకుని, ఎస్సీలకు అందుతున్న అవకాశాలను ఈ వర్గానికి కూడా అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో బేడ బుడగ జంగాల విద్యార్థులకు ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు కేటాయించి, ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గణ మద్దిలేటి, సాల రంగడు, జంగాల మహేష్, గోపాల్,బుడగజ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాల తనిఖీ.. నిబంధనలు పాటించాలంటూ ఆదేశాలు

**ఖరీఫ్ సీజన్ వచ్చేసింది అంటే రైతులకు పండగ వాతావరణం**





వెల్దుర్తి, జూన్ 13, (సీమ కిరణం న్యూస్ ) : వెల్దుర్తి పట్టణంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా శనివారం తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న వివిధ కంపెనీల ప్రత్తి, కంది, ఆముదం, కూరగాయల విత్తనాల నిల్వలు, బిల్లులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు విక్రయించే ప్రతి విత్తనానికి సంబంధించి లాట్ నంబర్, కంపెనీ వివరాలు, ఇతర సమాచారంతో కూడిన బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులకు ఆదేశించారు. అనుమతి లేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే విత్తనాలను గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పీ) కంటే అధిక ధరలకు విక్రయించరాదని సూచించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, స్టాక్ బోర్డులను సక్రమంగా నిర్వహిస్తూ రోజువారీ వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.రైతులు గుర్తు తెలియని వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లైసెన్స్ కలిగిన విత్తన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా సూచించారు. భూమిలో తగినంత తేమశాతం ఉన్నప్పుడే విత్తనాలను విత్తాలని రైతులకు సూచించారు.

# కర్నూలు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కె.వి. రాఘవేంద్ర



కర్నూలు క్రైమ్, జూన్ 13 (సీమకిరణం న్యూస్): కర్నూలు సబ్‌డివిజన్ డీఎస్పీగా కె.వి. రాఘవేంద్ర శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు కర్నూలు డీఎస్పీగా విధులు నిర్వహించిన జె. బాబు ప్రసాద్ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది, ఏపీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కె.వి. రాఘవేంద్ర నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా స్వస్థలమైన కె.వి. రాఘవేంద్ర నవంబర్ 1996లో ఎస్సైగా పోలీసు శాఖలో సేవలను ప్రారంభించారు. అనంతరం జూలై 2010లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా పదోన్నతి పొందారు. ఇటీవల మే 1, 2026న డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయనకు కర్నూలు సబ్‌డివిజన్ తొలి పోస్టింగ్‌గా లభించింది. ఎస్సైగా, సీఐగా ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో సుదీర్ఘకాలం సేవలందించిన కె.వి. రాఘవేంద్ర, డీఎస్పీ హోదాలో తొలిసారిగా కర్నూలు జిల్లాకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కర్నూలు సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

# జూన్ 15వ తేదీన ( సోమవారం) ఉదయం 9-30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం

**అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక**

**అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

కర్నూలు ,(సీమకిరణం న్యూస్): జూన్ 13:- ఈ నెల 15వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటల నుండి కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు , మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు వీవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.




# హెచ్‌డీఎఫ్‌సీ నుంచి సరికొత్త స్కీమ్

కనీసం రూ. 100 పెట్టుబడి చాలు.. లాస్ట్ డేట్ ఎప్పుడంటే? మ్యూచువల్ ఫండ్లలో మంచి రిటర్న్స్ కోసం చాలా మంది ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఇంకా.. ఎప్పటికప్పుడు ఇన్వెస్టర్లకు బెటర్ రిటర్న్స్ అందించేందుకు కొత్త కొత్త పథకాల్ని లాంఛ్ చేస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అతిపెద్ద ఫండ్ హౌస్‌ల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్.. ఇప్పుడు ఒక పథకాన్ని తీసుకొచ్చింది. ఇప్పటికే ఇది సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులోకి వచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్.. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ ఇండియా డిజిటల్ ఇండెక్స్ ఫండ్‌ను లాంఛ్ చేసింది. ఇది ఒక ఓపెన్ ఎండెడ్ స్కీమ్. నిఫ్టీ ఇండియా డిజిటల్ ఇండెక్స్ ఆధారంగా పెట్టుబడులు పెడుతుంది. ఇక ఈ న్యూ ఫండ్ ఆఫర్ (%చీఖీూ%) సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే ప్రారంభమైంది. ఇక దీంట్లో చేరేందుకు డిసెంబర్ 6 ఆఖరి తేదీగా ఉంది. ఈ ఫండ్ మేనేజర్లుగా నిర్మన్ మోరాఖియా, అరుణ్ అగర్వాల్ ఉన్నారు. కనీసం రూ. 100 పెట్టుబడితో ఈ స్కీమ్‌లో చేరేందుకు అవకాశం ఉంది. ఆ తర్వాత ఎంతైనా ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇక నిఫ్టీ ఇండియా డిజిటల్ ఇండెక్స్ సెక్యూరిటీల్లో 95 నుంచి 100 శాతం వరకు పెట్టుబడులు పెడుతుంది. ఇక సున్నా నుంచి 5 శాతం వరకు డెట్ సెక్యూరిటీలు, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఎగ్జిట్ లోడ్ సున్నాగానే ఉంది. లాంగ్ టర్మ్ పెట్టుబడులకు అయితే ఇది బెస్ట్ స్కీమ్ అని చెప్పొచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నికర ఆస్తుల విలువ 2024, అక్టోబర్ వరకు చూసినట్లయితే రూ. 7.84 లక్షల కోట్లుగా ఉంది. మొత్తం 132 వేర్వేరు పథకాలు ఉన్నాయి. ఇక మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిపోర్ట్ ప్రకారం.. ఈ ఫండ్ హౌస్ ఇన్వెస్ట్ చేస్తున్న టాప్- 10 స్టాక్స్ గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం. అన్నింటికంటే ఎక్కువగా ఈ మ్యూచువల్ ఫండ్.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోనే ఎక్కువ (7 శాతం) వాటా కలిగి ఉంది. అంతకుముందు నెల కంటే అక్టోబరులో మరో 10.77 లక్షల షేర్లను యాడ్ చేసుకుంది. ఐసీఐసీఐ బ్యాంకులో 5.9 శాతం మేర వాటా ఉంది. గత నెలలో అదనంగా 33.90 లక్షల షేర్లను తన పోర్ట్‌ఫోలియోలో చేర్చుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియోలో యాక్సిస్ బ్యాంక్ వాటా 3.6 శాతంగా ఉంది. ముందటి నెలతో పోలిస్తే ఇది 0.20 శాతం ఎక్కువ పెట్టుబడులు పెట్టింది. 1.17 కోట్ల షేర్లను అదనంగా చేర్చుకుంది. ఇక భారతీ ఎయిర్‌టెల్ వాటా 2.7 శాతంగా ఉంది. ఇందులో అంతకుముందు నెలతో పోలిస్తే వాటా స్వల్పంగా తగ్గించుకుంది. 1000 షేర్లను అమ్మేసింది. అక్టోబర్ నెలలో ఇన్ఫోసిస్ వాటా .. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్‌లో 2.5 శాతంగా ఉంది. అక్టోబర్ నెలలో కొత్తగా 11.12 లక్షల షేర్లను చేర్చుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ అండ్ టీలో వరుసగా 2.4 శాతం, 2.3 శాతం, 2.2 శాతం మేర పెట్టుబడులు ఉన్నాయి. అక్టోబరులో వరుసగా 1.25 కోట్లు, 20.61 లక్షలు, 3.95 లక్షల షేర్లను కొత్తగా చేర్చుకుంది.

## ఎస్‌బీఐ స్కీమ్.. రూ. 8 లక్షల పెట్టుబడిపై మూడేళ్లలో ఎంతొస్తుంది..

# ఏ బ్యాంకులో ఎక్కువ వడ్డీ వస్తుంది?




బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ అనేది ఎలాంటి రిస్క్ లేని పెట్టుబడి పథకం అని చెప్పొచ్చు. ఇక్కడ నిర్దిష్ట వడ్డీ రేటు ప్రకారం వడ్డీ స్థిరంగా వస్తుంటుంది. అందుకే డిపాజిట్లు చేసే ముందు ఏ బ్యాంకుల్లో వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయనేది తెలుసుకోవాలి. ఇప్పుడు ఎస్బీఐ సహా ఇతర ప్రముఖ బ్యాంకుల్లో మూడేళ్ల డిపాజిట్లపై వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో చూద్దాం. మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తున్నారా.. మరి ఏ టెన్యూర్ డిపాజిట్ ఎక్కువగా ఎంచుకుంటున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేట్లను గరిష్ఠ స్థాయిలో ఉంచినప్పటి నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు ఆకర్షణీయ స్థాయిలోనే ఉన్నాయి. ఇదే సమయంలో కొన్ని బ్యాంకులు స్పెషల్ డిపాజిట్లు తీసుకొచ్చి ఇంకాస్త వడ్డీ ఎక్కువే అందిస్తున్నాయి. అయితే.. సాధారణ పౌరుల కంటే సీనియర్ సిటిజెన్లకు వడ్డీ రేటు కాస్త ఎక్కువే ఉంటుంది. ఇంకా షార్ట్ టర్మ్ కంటే లాంగ్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ కొంచెం ఎక్కువ వస్తుంది. ఇదే సమయంలో దీర్ఘకాలంలో ఒకేసారి చేతికి రాబడి కూడా ఎక్కువే వస్తుంది. ఇప్పుడు మనం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకుల్లో 3 సంవత్సరాల టెన్యూర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో వడ్డీ రేట్లు సహా రూ. 8 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే.. రిటర్న్స్ ఎంత వస్తాయో చూద్దాం. ఏ బ్యాంకులో అయినా రెగ్యులర్ సిటిజెన్స్ కంటే సీనియర్ సిటిజెన్స్‌కు వడ్డీ రేట్లు ఎక్కువే ఉంటాయి. ఇప్పుడు ఎస్బీఐలో మూడేళ్ల డిపాజిట్‌పై సాధారణ పౌరులకు 6.75 శాతం వడ్డీ వస్తుంది. ఇదే సమయంలో సీనియర్ సిటిజెన్స్‌కు 7.25 శాతం వడ్డీ ఉంది. దీంతో ఇక్కడ 8 లక్షలు పెట్టుబడి పెట్టినట్లయితే సాధారణ ప్రజలకు మూడేళ్లలో వడ్డీ రూపంలో రూ. 1,77,914 వస్తుంది. అంటే మెచ్యూరిటీకి చేతికి మొత్తం రూ. 9.77 లక్షలకుపైగానే వస్తుంది. ఇక సీనియర్ సిటిజెన్లకు చూస్తే మెచ్యూరిటీకి చేతికి రూ. 9.92 లక్షలు వస్తాయి. మరో ప్రభుత్వ బ్యాంక్.. బ్యాంక్ ఆఫ్ బరోడాలో సాధారణ పౌరులకు వడ్డీ రేటు 7.15 శాతంగా ఉండగా.. సీనియర్ సిటిజెన్లకు 7.65 శాతంగా ఉంది. దీంతో 8 లక్షలు ఇన్వెస్ట్ చేసినట్లయితే ఇక్కడ వరుసగా వీరికి 8 లక్షల పెట్టుబడిపై వడ్డీ రూ. 1.89 లక్షలు, రూ. 2.04 లక్షలు వస్తాయి. అంటే ఇక్కడ మెచ్యూరిటీకి వరుసగా రూ. 9.89 లక్షలు, రూ. 10.04 లక్షల చొప్పున వస్తాయి. మరోవైపు కెనరా బ్యాంకులో చూస్తే.. 3 సంవత్సరాల వ్యవధి ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై సాధారణ పౌరులకు వడ్డీ రేటు 6.85 శాతంగా ఉండగా.. సీనియర్ సిటిజెన్లకు 7.65 శాతంగా ఉంది. దీంట్లో 8 లక్షల ఇన్వెస్ట్‌మెంట్‌పై వరుసగా వడ్డీ రూ. 1.79 లక్షలు, 2.04 లక్షల చొప్పున వస్తాయి. మిగతా బ్యాంకులతో పోలిస్తే.. ఎస్బీఐలోనే రిటర్న్స్ కాస్త తక్కువ ఉన్నాయని చెప్పొచ్చు.

## చుక్కలు చూయిస్తున్న బంగారం ధర.. మళ్లీ భారీగా జంప్..

## తులం రేటు ఎంతకు చేరిందంటే?

బంగారం ధరలు మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా వరుసగా పెరుగుతూ వస్తున్నాయి. తులం బంగారం ధర రూ. 3 వేలకుపైగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరలు పెరుగుతుండడమే ఇందుకు కారణం. అయితే, వెండి రేట్లు మాత్రం కాస్త ఊరట కల్పిస్తున్నాయి. ఈ క్రమంలో నవంబర్ 24వ తేదీన హైదరాబాద్ మార్కెట్లో తులం బంగారం ధర ఎంత పలుకుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం. బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి ధరలు చుక్కలు చూయిస్తున్నాయి. పసిడి ధరలు మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. గత వారం రోజుల్లో ప్రతి రోజూ బంగారం ధర పెరిగింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తున్న వార్తలతో పసిడి ధరలు మళ్లీ పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలిచాక బంగారం ధరలు భారీగా పడిపోయిన సంగతి తెలిసిందే. నవంబర్ తొలి అర్ధభాగంలో బంగారం ధరలు దాదాపు రూ.5 వేల వరకు పడిపోయాయి. దీంతో పసిడి ప్రియులు కొనుగోళ్లు చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ, ఇప్పుడు బంగారం ధరలు మళ్లీ వరుసగా పెరుగుతున్నాయి. గత వారం రోజుల్లోనే తులం బంగారం రేటు రూ.3 వేలకుపైగా పెరిగింది. ఈ క్రమంలో హైదరాబాద్ మార్కెట్లో నవంబర్ 24వ తేదీన తులం పసిడి ధర ఎంతకు చేరిందనే విషయాన్ని ఇప్పుడు మనం తెలుసుకుందాం. అంతర్జాతీయ మార్కెట్లలోనూ పసిడి ధరలు రికార్డ్ గరిష్ఠాల వైపు దూసుకెళ్తున్నాయి. క్రితం రోజుతో పోలిస్తే ఇవాళ స్థిరంగా ఉన్నాయి. ప్రస్తుతం స్పాట్ గోల్డ్ ధర ఒక ఔన్సుకు 2716 డాలర్లు పలుకుతోంది. అలాగే స్పాట్ సిల్వర్ ధర ఔన్సుకు 31.36 డాలర్ల వద్ద ట్రేడింగ్ అవుతోంది. మరోవైపు.. భారత రూపాయి మారకం విలువ రూ. 84.424 వద్ద అమ్ముడవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో పసిడి ధరలు వరుసగా ఏడో రోజూ పెరిగాయి. ఇవాళ 22 క్యారెట్ల బంగారం ధర తులంపై రూ.750 మేర పెరిగింది. దీంతో 10 గ్రాముల బంగారం రేటు రూ. 73 వేల మార్క్ తాకింది. ఇక 24 క్యారెట్ల బంగారం రేటు ఇవాళ తులంపై రూ. 820 పెరిగింది. దీంతో తులం ప్యూర్ గోల్డ్ రేటు రూ. 79 వేల 640 వద్దకు ఎగబాకింది. గత వారం రోజుల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర తులానికి రూ.4000 మేర పెరగడం గమనార్హం.

### స్థిరంగానే వెండి ధరలు..

బంగారం ధర భారీగా పెరుగుతూ బెంబేలెత్తిస్తున్న తరుణంలో వెండి మాత్రం కాస్త ఊరట కల్పిస్తోంది. వరుస సెషన్లలో ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా కొనసాగుతోంది. గత వారం రోజుల నుంచి కిలో వెండి రేటు రూ.1,01,000 మార్క్ వద్ద ట్రేడింగ్ అవుతోంది. ఇవాళ సైతం ఎలాంటి మార్పు లేదు. కిలో వెండి ధర రూ.1.01 లక్షల వద్దే ఉంది. అయితే, పైన పేర్కొన్న బంగారం, వెండి ధరల్లో జీఎస్టీ, సెస్ వంటి పన్నులు కలపలేదు. ట్యాక్సులు కలిపితే ధరలు ఇంకాస్త ఎక్కువే ఉంటాయి. కొనుగోలు చేసే ముందే స్థానిక జువెలర్స్ వద్ద రేట్లు తెలుసుకోవడం మంచిది.



# రూ. 10 లక్షల ఆదాయంపై నో టాక్స్.. పక్కా ప్లాన్‌తో ఇలా చేస్తే చాలు.. బెటర్ ఆప్షన్!

ఇటీవల బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను విధానం కింద కీలక మార్పులు చేసింది. స్టాండర్డ్ డిడక్షన్ పెంచడంతో పాటు.. పన్ను శ్లాబుల్ని కూడా సవరించింది. ఈ క్రమంలోనే కొత్త పన్ను విధానాన్ని సులభతరం చేసింది. అయితే రూ. 10 లక్షల ఆదాయంపై కొత్త పన్ను విధానంలో రూ. 40 వేలకుపైగా టాక్స్ చెల్లించాల్సి వస్తుంది. ఇదే పాత పన్ను విధానంలో చూస్తే.. రూ. 10 లక్షల వరకు ఆదాయంపై ఇలా చేస్తే రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన పని ఉండదు. 2024 బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసిన సంగతి తెలిసిందే. పన్ను చెల్లింపు దారులు కొత్త పన్ను విధానం ఎంచుకునేందుకు సులభతరం చేస్తూ నిర్ణయాలు ప్రకటించింది. దీని కింద కొత్త పన్ను విధానంలోనే స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ. 50 వేల నుంచి రూ. 75 వేలకు పెంచింది. ఇంకా పన్ను శ్లాబుల్లో కీలక మార్పులు చేసింది. గతంలో రూ. 3-6 లక్షల వరకు టాక్స్ శ్లాబ్ ఉండగా.. దీనిని రూ. 7 లక్షల వరకు పెంచింది. అదే విధంగా రూ. 6-9 లక్షలకు ఒక శ్లాబ్ ఉండగా.. దీనిని రూ. 7-10 లక్షలకు చేసింది. దీంతో రూ. 6-7 లక్షలు, రూ. 9-10 లక్షల ఇన్‌కం బ్రాకెట్‌పై టాక్స్ తగ్గించుకోవచ్చు. అధిక ఆదాయంపైనా టాక్స్ తగ్గుతుంది. ఈ విధానంతో కొత్త ఆదాయపు పన్ను విధానం కింద గరిష్ఠంగా రూ. 7.75 లక్షల వరకు ఆదాయంపై పన్ను తగ్గించుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే ఇదే సమయంలో రూ. 10 లక్షల ఆదాయంపై కొత్త పన్ను విధానంలో అంతకుముందు రూ. 52,500 వరకు టాక్స్ చెల్లించాల్సి ఉండగా.. ఇప్పుడు మార్పుల తర్వాత రూ. 42,500 కు తగ్గింది. అంటే రూ. 10 వేలు ఆదా అవుతుంది. ఇక్కడే పాత పన్ను విధానం ఎంచుకుంటే రూ. 10 లక్షల ఆదాయంపై రూపాయి పన్ను చెల్లించాల్సిన అవసరం కూడా లేకుండా ప్లాన్ చేసుకోవచ్చు. అదెలాగో చూద్దాం. కొత్త పన్ను విధానంతో పోలిస్తే పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపులు, తగ్గింపులకు ఆస్కారం ఉంటుంది. ఇక్కడ స్టాండర్డ్ డిడక్షన్ రూ. 50 వేలుగానే ఉన్నప్పటికీ.. పన్ను తగ్గించుకునేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. పన్ను మినహాయింపు కల్పించే పెట్టుబడులు ఇందుకు కారణం. ముందుగా రూ. 10 లక్షల ఆదాయంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ. 50 వేలు తీసేస్తే రూ. 9.50 లక్షలవుతుంది. దీనిపై పన్ను లెక్కిద్దాం. సెక్షన్ 80 పీపీఎఫ్, ఈపీఎఫ్, సహా ఇతర టాక్స్ సేవింగ్ ఇన్వెస్ట్‌మెంట్ల ద్వారా ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 కింద ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు పన్ను తగ్గించుకోవచ్చు. ఐదేళ్ల టెన్యూర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా ఇందులోకి వస్తాయి. అప్పుడు రూ. 9.50 లక్షల నుంచి రూ. 1.50 లక్షలు తీసేస్తే.. రూ. 8 లక్షలవుతుంది. సెక్షన్ 80%జజణ (1దీ%) - సెక్షన్ 80%జ% కింద రూ.1.50 లక్షలు మినహాయించిన తర్వాత.. దీనికి అదనంగా %చీూ% టైర్-1 ఖాతాకు కాంట్రిబ్యూషన్ల ద్వారా ఈ సెక్షన్‌తో అదనంగా రూ. 50 వేలు పన్ను మినహాయింపు పొందొచ్చు. అప్పుడు రూ. 50 వేలు మినహాయించిన తర్వాత ఆదాయం రూ. 7.50 లక్షలవుతుంది. హోం లోన్ వడ్డీ- సెక్షన్ 24%దీ% ద్వారా హోం లోన్ వడ్డీ మినహాయించుకోవచ్చు. గృహ యజమానులు ఈ సెక్షన్ కింద హోం లోన్‌పై చెల్లించిన వడ్డీపై రూ. 2 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందొచ్చు. ఇది పన్ను భారాన్ని తగ్గిస్తుందని చెప్పొచ్చు. అప్పుడు రూ. 7.50 లక్షల నుంచి రూ. 2 లక్షలు తీసేస్తే రూ. 5.50 లక్షలవుతుంది. మెడికల్ ఖర్చులు- సెక్షన్ 80%ణ% కింద ఆరోగ్య బీమా ప్రీమియం ద్వారా పన్ను మినహాయింపునకు అర్హులు. మీరు, మీ లైఫ్ పార్ట్‌నర్‌కు, మీపై ఆధారపడిన పిల్లలకు హెల్త్ ఇన్సూరెన్స్ కోసం మీరు చెల్లించే ప్రీమియం మొత్తాన్ని రూ. 25 వేల వరకు తగ్గించుకోవచ్చు. మీరు లేదా మీ జీవిత భాగస్వామి సీనియర్ సిటిజెన్ అయితే అదనంగా మరో రూ. 25 వేలు మినహాయింపు పొందొచ్చు. ఇలా మీ ఆదాయం రూ. 5 లక్షల దిగువకు చేరుతుంది. ఇక పాత పన్ను విధానంలో రూ. 5 లక్షల కంటే తక్కువ ఆదాయంపై సెక్షన్ 87%ూ% కింద టాక్స్ రిబేట్ వర్తిస్తుంది. దీంతో ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదన్నమాట. అయితే ఇవన్నీ మినహాయింపులు పొందితేనే టాక్స్ ఆదా చేసుకోవచ్చు. కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లు తక్కువగా ఉన్నప్పటికీ మినహాయింపులు మాత్రం లేవు.




## పిల్లల కోసం కేంద్రం కొత్త పథకం..

# 2 లక్షల బెనిఫిట్.. పూర్తి వివరాలివే..




కేంద్ర ప్రభుత్వం బడ్జెట్-2024లో కీలక ప్రకటనలు చేసిన సంగతి తెలిసిందే. ఆదాయపు పన్నుకు సంబంధించి స్టాండర్డ్ డిడక్షన్ పెంచడంతో పాటుగా.. కొత్త పన్ను విధానంలో శ్లాబుల్ని సవరించింది. ఇదే సమయంలో %చీూ% పథకంలో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించారు. పిల్లల కోసం కూడా ఇదే సమయంలో కొత్త పెన్షన్ పథకాన్ని ప్రకటించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. చిన్నప్పటి నుంచే ఈ స్కీంలో పెట్టుబడులు పెట్టొచ్చని చెప్పారు. పిల్లలకు బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఇప్పటినుంచే పొదుపు చేసేలా కొత్త అవకాశం కల్పిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. దీనికి అనుగుణంగా న్యూ పెన్షన్ విధానంలో (%చీవఱశీఅaశ జుఅంఱశీఅ ూషష్ట్రవఎవ%) మార్పులు చేసింది. ఈ పెన్షన్ స్కీంలో మైనర్లను చేర్చేలా ఎన్‌పీఎస్ వాత్సల్యను ప్రారంభించనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఈ పథకంతో మైనర్ల పేరెంట్స్ లేదా సంరక్షకులు పిల్లల పేర్లపై కూడా ఇకపై పెట్టుబడులు పెట్టొచ్చని తెలిపారు నిర్మలా సీతారామన్‌ఇక పిల్లలు మేజర్ అయిన తర్వాత అంటే 18 సంవత్సరాలు దాటిన తర్వాత.. వారి అకౌంట్ ఆటోమేటిక్‌గా సాధారణ %చీూ% అకౌంట్‌గా మారుతుందని పేర్కొన్నారు. ఈ పథకం సాయంతో ప్లాన్ పూర్తయిన తర్వాత స్థిర ఆదాయం లభిస్తుందని తెలిపారు నిర్మలమ్మ. భారత ప్రజలు అందరికీ సామాజిక భద్రత కల్పించాలన్న ఉద్దేశంతోనే కేంద్రం.. 2004లో ఎన్‌పీఎస్‌ను తీసుకొచ్చింది. దీంట్లో గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు పన్ను ప్రయోజనాలు పొందొచ్చు. సెక్షన్ 80%జజణ (1దీ%) కింద రూ. 50 వేల పన్ను మినహాయింపు సహా సెక్షన్ 80%జ% కింద రూ. 1.50 లక్షలు పొందొచ్చు. ఇది పాత పన్ను విధానంలో ఉంది. ఇంకా దీర్ఘకాలిక పెట్టుబడిగా కూడా విపరీతంగా ప్రాచుర్యం పొందింది. కార్పొరేట్ బాండ్స్, ఈక్విటీలు, ప్రభుత్వ సెక్యూరిటీలు ఇలా %చీూ% చందాదారుడు.. తనకు నచ్చిన పథకంలో మదుపు చేయొచ్చు. రిటైర్మెంట్ తర్వాత %చీూ% నిధి నుంచి ఒకేసారి 60 శాతం ఉపసంహరించుకోవచ్చు. మిగతా 40 శాతంతో.. తప్పనిసరిగా యాన్యుటీ పథకాల్ని కొనుగోలు చేయాలి. దీంతోనే రిటైర్మెంట్ తర్వాత క్రమంగా పెన్షన్ పొందొచ్చు. ఇంకా బడ్జెట్‌లో.. ఉద్యోగుల సామాజిక భద్రతా ప్రయోజనాల్ని మెరుగుపర్చేలా %చీూ% ను మరింత ఆకర్షణీయంగా మార్చారు. ప్రైవేట్ కంపెనీలు తమ ఉద్యోగి %చీూ% అకౌంట్లో నిధులు జమ చేస్తున్నట్లయితే ఆ సంస్థలు పన్ను రాయితీ పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కంపెనీలు.. తమ ఉద్యోగుల ఎన్‌పీఎస్‌కు తమ వాటా కింద చెల్లించే మొత్తంపై (మూలవేతనం ప్లస్ డీఏ) 10 శాతం వరకు టాక్స్ మినహాయింపు వర్తిస్తుంది. తాజా బడ్జెట్‌లో దీనిని 14 శాతానికి పెంచారు. ఇంకా కొత్త పన్ను విధానం ఎంచుకున్న ఉద్యోగులు.. తమ %చీూ% వాటాలపై పన్ను మినహాయింపు పొందొచ్చని ప్రకటించారు నిర్మలా సీతారామన్. ప్రైవేట్ రంగంలో పనిచేసే ఉద్యోగులు లేదా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పనిచేసే వారు కొత్త టాక్స్ విధానం ఎంచుకుంటే.. వారు తమ ఎన్‌పీఎస్ వాటాపై 14 శాతం వరకు పన్ను రాయితీ పొందొచ్చని వెల్లడించారు. ఈ క్రమంలోనే %చీూ% పథకంపై ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళన అంశాన్ని కూడా నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. సదరు సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే కొత్త ప్రకటన చేయనున్నట్లు తెలిపారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com